

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 20.0



సూపర్ సిక్స్‌తో సంక్షేమం



తణుకులో రోడ్ షో.. ప్రజాగళం సూపర్ సక్సెస్

కూటమి గెలిస్తే తణుకులో హైటెక్ టవర్

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం
- అన్నదాతకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం
- వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్
- అవినీతిలో కారుమూరి మహా ముదురు

ఆరిమిల్లిని, వర్మను గెలిపించాలని చంద్రబాబు పిలుపు

భీమవరం/తణుకు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి బృందం):'తణుకు సభ అదుర్స్ కూటమి అభ్యర్థులను గెలిపించండి. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్‌తో సంక్షేమ పథకాలను అమలు చేస్తాం. ఆడ బిడ్డ నిధి కింద ప్రతి ఆడపిల్లకు నెలకు రూ.1500, తల్లికి వందనం కింద ప్రతి బిడ్డకు రూ.15 వేలు, ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహకారం, యువగళం పథకంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తాం. వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందజేస్తాం' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. తణుకులో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగళం సభకు వేలాదిగా జనం రావడంతో ఉత్సాహంగా.. ఉత్తేజంగా ప్రసంగించారు. చంద్రబాబు మంత్రి కారుమూరి అవినీతి దందాను ఎండగట్టారు. 'నా 14 ఏళ్ల ముఖ్యమంత్రి అనుభవంలో మంత్రి కారుమూరి వంటి అవినీతిపరుడిని చూడలేదు. కారుమూరి మహా ముదురు. తణుకులో రూ.850 కోట్ల టీడీఆర్ బాండ్‌ల కుంభకోణానికి పాల్పడ్డాడు. తిరుపతి వంటి నగరాల్లో టీడీఆర్ బాండ్‌ల అవినీతికి మార్గదర్శకుడయ్యాడు. ఇళ్ల స్థలాల కోసం తక్కువ ధరకు భూములు కొని, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మాడు. పేదల ఇళ్ల స్థలాల కేటాయింపులోనూ రూ.30 వేల నుంచి 50 వేల వరకు వసూలు చేశారు. రేషన్ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు రవాణా చేసి అడ్డంగా దోచుకున్నారు. ధాన్యం మొలకెత్తుతున్నాయంటూ రైతు తమ సమస్యను మంత్రి దృష్టికి వెళితే ఎర్రిపప్ప అంటూ సంబోధించాడు. పైగా ఎర్రిపప్ప అంటే తప్పులేదంటూ చెప్పుకొచ్చాడు. అందుకే ఎర్రి పప్ప మంత్రిని ఎన్నికల్లో సాగనంపండి' అంటూ చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆ మాట అనగానే జనమంతా కేరింతలు పెట్టారు. వారాహి యాత్రను అడ్డుకోవడానికి జన సైనికునిపై మంత్రి దాడి చేయించారు. పవన్ కల్యాణ్ కన్నెర్ర చేస్తే ఎక్కడికి పోతావ్ అంటూ కారుమూరిని చంద్రబాబు నిలదీశారు. ఏ బిల్డర్ అయినా నిర్మాణం చేపట్టాలన్నా.. వెంచర్ వేయాలన్నా కారుమూరి ట్యాక్స్ కట్టాలి. అభివృద్ధి చేయాలన్నా కె ట్యాక్స్ తప్పనిసరి. రానున్న ఎన్నికల్లో మంత్రి కారుమూరిని బుద్ధి చెప్పండి అంటూ చంద్రబాబు పిలుపునిచ్చారు. కూటమి గెలిస్తే తణుకు పట్టణంలో హైటెక్ టవర్‌ను ఏర్పాటు చేస్తాం. ఇంటి నుంచే ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగం చేసుకునేలా యువతకు ఉపాధి కల్పిస్తాం అంటూ చంద్రబాబు భరోసా ఇచ్చారు.


ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో పవన్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి, ఎంపీ అభ్యర్థి వర్మ... బ్రోచర్ ఆవిష్కరణ



వైసీపీ పాలనను తరిమి కొట్టాలి

తణకు ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజా వేదిక కూల్చివేతతో ఐదేళ్ల విధ్వంసకర పాలన మొదలు పెట్టిన జగన్ హయాంలో అవినీతి అరాచకాలే. ఈ పాలనకు చరమగీతం పాడాలి. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేసుకోవాలి. కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు తణుకు నాంది కావాలి. ఇక్కడ స్థానిక మంత్రి అన్నివర్గాలను దోచేశారు. టీడీఆర్ కుంభకోణానికి పాల్పడ్డారు. అవినీతిలో వైసీపీ బ్రాండ్ అంబాసిడర్. నేను ఎమ్మెల్యేగా తణుకును ఎంతో అభివృద్ధి చేశాను. మరోసారి అవకాశం కల్పిస్తే మాస్టర్ ప్లాన్ ద్వారా పట్టణాభివృద్ధి, కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం వంటి పనులు చేస్తా' అని హామీ ఇచ్చారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ 'రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపిన వ్యక్తి చంద్రబాబు. తణుకులో జన సమూహం చూస్తే కూటమికి 170 సీట్లు ఖాయం. రాష్ట్రంలో సీఎం జగన్ ప్రజలను మోసం చేస్తున్నాడు. ఒక చేతితో వంద ఇచ్చి మరో చేత్తో వెయ్యి దోచుకుంటున్నాడు. ప్రజలు ఆలోచించి కూటమి అభ్యర్థులను గెలిపించాలి' అని కోరారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ 'అధికార పార్టీ నాయకుల అబద్ధపు వాగ్దానాలు, ప్రచారాలను నమ్మవద్దు. రాత్రి పూట అధికారులను స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. నవరత్నాలు విఫలమయ్యాయి. దోపిడి సొమ్ములు పంపిస్తున్న జగన్ డబ్బుతో నెగ్గాలని చూస్తున్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి, భవిష్యత్‌ను బాగు చేసుకోవాలి' అని కోరారు. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ దోపిడీకి కేరాఫ్‌గా మారిన జగన్ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపి, అభివృద్ధి కోసం చంద్రబాబు కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్‌ను ఇంటికి పంపించకుంటే మనం ఇంటిలో ఉండలేమని నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. అవినీతి పాలనకు వ్యతిరేకంగా ఏర్పడిన ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ కోరారు.

అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో తండ్రీకొడుకుల పోటీ

- జగన్ సహా వీరిని గోస్తనీ నదిలో కలిపేయాలి
- మంత్రి కారుమూరిపై పవన్ కల్యాణ్ ఫైర్



'తణుకులో జనసేనకు సీటు ప్రకటించా. పొత్తులో ఇవ్వలేకపోయా. అనకాపల్లి ఎంపీ స్థానాన్ని మా అన్న నాగబాబుకు ఇవ్వాలని ప్రకటించాం. కానీ పొత్తులో బీజేపీకి ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం తగ్గాం. అంతే కాని జనసేనను తగ్గించాలని కాదు. మా వాళ్లు ఒకరు తగ్గితే. మీరు గెలుస్తారు. మీకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే అందరికీ సీట్లు ఇవ్వలేకపోయాం. ఎక్కడ నెగ్గాలో కాదు. ఎక్కడ తగ్గాలో తెలియాలి. ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. తణుకులో ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలి' అంటూ పవన్ కల్యాణ్ కోరారు. 'ఐదేళ్ల వైసీపీ పాలనలో తణుకు అభివృద్ధి చెందలేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశాలు వున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోలేదు. అవినీతిపైనే ఆధారపడ్డారు. అవినీతి మార్గాలతో ఇక్కడ సంపాదించిన డబ్బును తండ్రీ, కొడుకులు హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టి పరిశ్రమలను స్థాపించారు. అదే ఇక్కడ పెడితే కనీసం యువతకైనా ఉద్యోగాలు వచ్చేవి. అవినీతి డబ్బుతో తండ్రీ, కొడుకులు ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఇద్దరినీ చిత్తుగా ఓడించాలి. జగన్, మంత్రి, కొడుకులు ఎంతగా దోపిడీ చేస్తున్నారో అందరికీ తెలుసు. వారిని రానున్న ఎన్నికల్లో 'గోస్తనీ నదిలో కలిపేయాలి' అంటూ పవన్ కల్యాణ్ ఘాటుగా స్పందించారు. ఎర్రకాలువ అభివృద్ధితోపాటు, ప్రతి ఎకరానికి సాగు నీరు అందించడానికి, తణుకు పట్టణాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దడానికి, నియోజకవర్గ అభివృద్ధికి ఆరిమిల్లిని గెలిపించాలి' అని విజ్ఞప్తి చేశారు.

పులకించిన తణుకు

చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రజాగళం సభ సూపర్ సక్సెస్ అయ్యింది. తణుకు పట్టణంలోని రోడ్లన్నీ జనసంద్రంగా మారింది. బుధవారం మధ్యాహ్నం నేతలు ఇద్దరూ వేర్వేరు హెలీకాప్టర్‌లలో తణుకు వచ్చారు. హెలీ ప్యాడ్ నుంచి ఇద్దరూ ఒకే కాన్వాయ్‌లో రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్రసెంటర్ చేరుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా వున్న అశేష ప్రజలకు అభివాదాలు చేశారు.




దారి పొడవునా..'వెయ్'.. దరువెయ్

రహదారి పొడవునా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, అభిమానులు మూడు పార్టీల జెండాలతో నినాదాలు చేశారు. సభ ప్రాంగణం వద్ద రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. చంద్రబాబు, పవన్ ప్రసంగాలు పూర్తయ్యే వరకు ఏ ఒక్కరూ కదలకపోవడం విశేషం. తణుకులో నేతలు ఇద్దరూ తొలిసారిగా రోడ్ షో, సభ నిర్వహించడం, అది సూపర్ సక్సెస్ కావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపైంది. సభ ప్రారంభం కాక ముందు విడివాడ అభిమానులు కొందరు ప్లకార్డులతో రావడంతో టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.


ఎటు చూసినా జన ప్రవాహం


చిన్నారుల నుంచి యువత వరకు అభిమాన తరంగం


యువత సమరోత్సాహం


మహిళల విజయకేతనం

సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం టౌన్, ఏప్రిల్ 10 : సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని పీవోలు, ఏపీవోలను జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ ఆదేశించారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం భీమవరం నియోజకవర్గ ప్రిసైడింగు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియపై, హ్యాండు బుక్, మాన్యువల్, ఈవీఎంలపై అవగాహన కల్పించారు. మాక్ పోల్ నిర్వహణను వివరించారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని విషయాలను ప్రతి ఒక్కరు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను బాగా చదువుకుని, ఏమైనా సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగు సమయంలో అధికారులు ఇచ్చిన ఆహారం, మంచి నీరు, అల్పాహారం మాత్రమే తీసుకోవాలని, ఏ రాజకీయ పార్టీలు ఇచ్చిన వస్తువులు, ఆహార పదార్థాలను తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఆర్డీవో, ఆర్వో కె.శ్రీనివాసులురాజు, కమిషనరు ఎం.శ్యామల, పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.


ప్రిసైడింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చెక్ పోస్టుల తనిఖీ పక్కాగా ఉండాలి

ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు మోహన్ మిశ్రా


లోసరిలో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ప్రత్యేక ఎన్నికల అధికారి మోహన్ మిశ్రా

భీమవరంటౌన్, ఏప్రిల్ 10 : బోర్డరు చెక్ పోస్టులలో 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు పక్కాగా చేపట్టాలని ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు రామ్‌మోహన్ మిశ్రా ఆదేశించారు. బుధవారం భీమవరం మండలం లోసరి వద్ద బోర్డరు చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించి, స్టాటిక్ సర్వే లెన్స్ టీమ్‌కు దిశా నిర్దేశం చేశారు. నగదు, మద్యం, తదితర పట్టుకున్న వాటిని పక్కగా నమోదు చేయాలన్నారు. తనిఖీల ప్రక్రియను వీడియో రికార్డింగు చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆధారాలు లేకుండా నగదు, మద్యం, విలువైన బహుమతులు, తదితరవాటిని తరలిస్తే సీజ్ చేసి, ఖజానాలో భద్రపరిచేందుకు సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. ఆయనకు తొలుత జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్, ఎస్పీ వి.అజిత స్వాగతం పలికారు.

- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మోహన్ మిశ్రా సందర్శించారు. మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టరు, ఎస్పీ ఆయనకు వివరించారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు, వివిధ శాఖలు జిల్లా అధికారులు, ఎలక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


హోమగుండం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎంపీ రఘురామ

సోమేశ్వరుడి ఆశీస్సులతో గెలుస్తా

- ఎంపీ రఘురామ పాశుపతి హోమం

పెనుమంట్ర, ఏప్రిల్ 10 : శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆశీస్సులతోనే మళ్లీ చట్టసభల్లో అడుగుపెడతానని నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు వెల్లడించారు. బుధవారం పెనుమంట్ర మండలం జుత్తిగలో బాబు ఆధ్వర్యంలో పాశుపతి హోమం, సోమేశ్వరస్వామికి అభిషేకాలు, ఉమాదేవికి కుంకుమ పూజలు చేశారు. ఎంపీకి వేద పండితులు వేద మంత్రాలు, పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తారా? అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తారా ? అనే విషయం ఒకటి, రెండు రోజుల్లో క్లారిటీ వస్తుందని ఎంపీ తెలిపారు. ఐదేళ్ల క్రితం ఆలయంలో పూజలు చేసి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించానని, మళ్లీ పోటీ చేసేందుకు స్వామి ఆశీస్సులు పొందినట్లు తెలిపారు. కూటమి నాయకులు గొలుగూరి శ్రీనివాస రెడ్డి, కొవ్వూరి సోము భాస్కర్‌రెడ్డి, నల్లమిల్లి నర్సిరెడ్డి, కర్రి సుబ్బారెడ్డి, టీఎస్‌కే రెడ్డి, షేక్ అలీ తదితరులు ఉన్నారు.

108 మంది వలంటీర్ల రాజీనామా

-7లో



నేడు రంజాన్

ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పండుగకు జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

15 నుంచి సముద్రంలో వేట నిషేధం

నరసాపురం/భీమవరం టౌన్ ఏప్రిల్ 10: నరసాపురం తీర ప్రాంతంలో ఈ నెల 15 నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు సముద్ర వేట నిషేధ ఆజ్ఞలు అమలులోకి రానున్నాయి. ఈ మేరకు కేంద్రం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి ఎక్కువగా జరుగుతుంటుంది. ఆ సమయంలో వేట సాగిస్తే మత్స్య సంపద హరించిపోతుందన్న ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా కేంద్రం వేట నిషేధాజ్ఞలు అమలు చేస్తుంది. దీనిలో భాగంగా ఈ ఏడాది నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సముద్రతీరంలో ఈ నిషేధాజ్ఞలు అమలులోకి తీసుకొస్తున్నట్టు జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ ప్రసాద్ చెప్పారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే వేట చేసిన బోటు రిజిస్ట్రేషన్ రద్దు చేసి యజమానులపై ఆంధ్రప్రదేశ్ మత్స్య క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం చర్యలను తీసుకుంటామని, ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు రద్దు చేస్తామని హెచ్చరించారు.

జిల్లాలో నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. గోదావరి సముద్రంలో కలిసే ప్రదేశం కావడంతో ఇక్కడ మత్స్యసంపద అపారంగా దొరుకుతుంది. ఈ కారణంగా స్థానిక మత్స్యకారులతోపాటు నెల్లూరు, కాకినాడ, నిజాంపట్నం తదితర ప్రాంతాల నుంచి సీజన్‌లో ఇక్కడికి వందలాది బోట్లు వేటకు వస్తుంటాయి. ఏటా రూ.300 కోట్లకు పైగా విలువైన మత్స్య సంపద ఎగుమతి జరుగుతుంటుంది. స్థానికంగా 1500 మంది మత్స్యకారులు వేటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు ఐదు వేల మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఐస్ ఫ్యాక్టరీలు, ఆక్వా ఎగుమతి కంపెనీల్లో పనిచేసే వారే ఎక్కువ. నిషేధం కారణంగా వీరందరికీ ఉపాధి ఉండదు. ప్రభుత్వం మాత్రం సముద్రవేట సాగించే 1500 మత్స్యకారులు ఒక్కొక్కరికి ఈ రెండు నెలల కాలానికి రూ.20 వేల చొప్పున జీవన భృతి అందిస్తుంది.


విద్యార్థులను అభినందిస్తున్న కార్యదర్శి గాదిరాజు బాబు, పాండురంగరాజు

రోప్ స్కిప్పింగ్‌లో డీఎన్నార్ విద్యార్థుల ప్రతిభ

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : భోపాల్‌లో జరిగిన ఆల్ ఇండియా అంతర్ యూనివర్సిటీల రోప్ స్కిప్పింగ్ పోటీల్లో డీఎన్నార్ కళాశాల విద్యార్థులు మూడు బంగారు పతకాలు, రెండు రజిత పథకాలు సాధించినట్లు కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. నన్నయ్య యూనివర్సిటీ తరుపున పాల్గొని బహుమతులు సాధించారన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, నన్నయ్య యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ టీం కోచ్‌గా వ్యవహరించిన డాక్టర్ నరసింరాజు మాట్లాడుతూ 37 యూనివర్సిటీల నుంచి క్రీడాకారులు రాగా మన విద్యార్థులు మూడు బంగారు పతకాలు, 2 రజిత పతకాలు, మహిళలు ఒక రజిత పతకం సాధించారని తెలిపారు. ఏవో రామకృష్ణంరాజు, పీడీ శేఖర్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 10: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15 వతేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు.

13 నుంచి ఆశ్రం కళాశాలలో గేమ్స్ మీట్

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 10:ఏలూరు ఆశ్రం కళాశాలలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు దంత కళాశాల విద్యార్థులకు డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 24వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ యూని వర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, విజయవాడకు అనుబంధంగా ఉన్న కళాశాలలు విద్యార్థులకు వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్,త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, చదరంగం పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ మీట్‌లో 25 మెడికల్, డెంటల్ కాలేజీలు పాల్గొంటున్నాయన్నారు. ఈ మెగా ఈవెంట్‌లో దాదాపు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

పితాని విజయం కోరుతూ కళాకారుడి ప్రచారం



ఆచంట, ఏప్రిల్ 10: ఆచంట నియోజకవర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పితాని సత్యనారాయణను గెలిపించాలని కోరుతూ జానపద విభాగం కళాకారుడు అయిన మిరియాల సిద్ధయ్య తమ వాహనంపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని ప్రచారం చేస్తూ పలువురిని ఆకర్షిస్తున్నాడు. ఈ ప్రచారంలో బాబు గ్యారెంటీ, భవిష్యత్తు గ్యారెంటీ.. సూపర్‌సిక్స్ వంటి పథకాలపై గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలగా టీడీపీపై అభిమానంతో ఎన్నికల సమయంలో ఇలా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సిద్ధయ్య తెలిపారు.

చెరువుల్లో మోటార్ల తొలగింపు



భీమడోలు, ఏప్రిల్ 10: ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో చెరువుల్లో ఏర్పాటు చేసిన నీటి సరఫరా మోటార్లను అధికారులు బుధవారం తొలగించారు. తాగునీటి చెరువుల్లో మోటార్లు ఏర్పా టుచేసి చేపల చెరువులకు నీటిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటా మని తహసీల్దార్ వరహాలయ్య అన్నారు. ఎంపీడీవో స్వర్ణకుమారి, తహసీ ల్దార్ వరహాలయ్య, అటవీ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ నిర్వహించి అక్రమ మోటారు కనెక్షన్లను తొలగించారు. భవిష్యత్తులో మళ్లీ మోటారు ఏర్పాటు చేస్తే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు.

కాంతారావుకు చిత్ర కళానిధి పురస్కారం


బిరుదు ప్రదానం చేస్తున్న అంబికా అధినేతలు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 10: చిత్రకళకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్న ఏలూరువాసి మజ్జి కాంతారావు ధన్యుడని మాజీ ఎమ్మెల్యే, అంబికా గ్రూప్ సంస్థల అధినేత అంబికా కృష్ణ అన్నారు. స్నేహం అసోసియేషన్ వార్షికోత్సవం అంబికా భవన్‌లో బుధవారం నిర్వహించారు. జాతీయస్థాయిలో పేరొందిన చిత్రకళాకారుడు మజ్జి కాంతారావుకు చిత్ర కళానిధి బిరుదు ప్రదానం చేశారు. ఎంతోమందిని చిత్ర కళాకారులుగా తీర్చిదిద్దిన కాంతారావును అభినందించారు. స్నేహమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంబికా రాజా మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా ఏటా ప్రము ఖులకు పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. అంబికా ప్రసాద్, కళారత్న కేవీ.సత్యనారాయణ, ఆడిటర్ జి.రాధాకృష్ణ, రచయిత గురుశర్మ, గాయకులు కేఎల్‌వీ.నరసింహం, పలువురు సాహితివేత్తలు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.


ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా, బెల్లపుఊట

20 లీటర్ల సారా స్వాధీనం.. 1500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుల ఆదేశాల మేరకు అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు.టినర్సాపురం మండలం బంధంచర్లలో సారా బట్టీలపై దాడి చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఎస్ఈబీ డీఎస్పీ జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇంటిలిజెన్స్ ఎస్ఐ మురళీధర్, ఏఎస్ఐ పూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు



10-04-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	242	225	235.57
	జంగారెడ్డిగూడెం-1	242	235	240.23
	జంగారెడ్డిగూడెం-2	242	235	239.81
	కొయ్యలగూడెం	244	235	240.04
	గోపాలపురం	243	235	239.89

చల్ల..చల్లగా

మట్టి కుండలకు గిరాకీ


ఏలూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కుండలు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 10 : రోజురోజుకీ ఎండలు మండుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండ తీవ్రత తారస్థాయికి చేరింది. వేడి నుంచి ఉపశమనం కోసం చల్లగా తాగాలనిపిస్తుంది. ఫ్రిజ్‌లో నీరు తాగితే రొంప, దగ్గు వేదిస్తున్నాయి. దీంతో చాలా మంది మట్టి కుండలను వినియోగిస్తున్నారు. కుండలో నీరు తాగితే ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవనే భావనతో మట్టి



కుండలు కొనుగోలు చేస్తుండడంతో వాటికి డిమాండ్ పెరిగింది. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు తదితర ప్రాంతాల్లో ఈ మట్టి కుండల అమ్మకాలు జరుగుతున్నాయి. డిమాండ్‌ను బట్టి ధరలు కూడా ఏడాది కేడాదికి పెరుగుతూనే ఉన్నాయి.ఏలూరు ఆర్‌అండ్‌బీ కార్యాలయం సెంటర్‌లో ఈ మట్టి కుండల అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో కుండ రూ.250 పైగానే ధర పలుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.200 నుంచి ధరలు ఉన్నాయి. వివిధ రంగులతో అందమైన ఆకృతులతో ఈ కుండలను తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈసారి కుండలు అమ్మకాలు పెరిగాయని అమ్మకందారులు చెబుతున్నారు.



ఈద్ ముబారక్

నేడు రంజాన్



గణపవరం, భీమవరంలో ముస్తాబైన మసీదులు

గణపవరం, ఏప్రిల్ 10 : ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే రంజాన్ పండుగకు అంతా సిద్ధమైంది. సుమారు నెలరోజుల పాటు కఠిన నిబంధనలతో ఉపవాస దీక్షలో పాల్గొన్న ముస్లింలు గురువారం రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను ఇంటింటా ఘనంగా జరుపుకోనున్నారు. గల్ఫ్‌దేశాల్లో మంగళవారం నెలవంక దర్శనమివ్వడంతో బుధవారం రంజాన్ జరుపుకున్నారు. మరుసటి రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ భక్తి భావాన్ని చాటుకోనున్నారు. గణపవరం పెద్ద మసీదులో విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు. రంజాన్‌మాసం హృదయ సంస్కరణకు దోహదపడే మాసంగా ముస్లింలు తమ హృదయాల్లో అల్లాను నింపుకుని ప్రార్థనలు చేస్తారు. మహ్మద్ ప్రవక్త హజరత్ మహ్మద్ ఏడాదిలోని 12 మాసాల్లో ఒక మాసం సానుభూతి చూపాలని వేడుకున్నారు. ముఖ్యంగా హిందువులను కూడా ఈ పండుగకు ఆహ్వానించి పసందైన వంటకాలు వడ్డిస్తారు. సర్వమత సమ్మేళనానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. ఈద్ నమాజ్ ముందే ముస్లింలు ఫిత్రా చెల్లిస్తారు. ధనిక,పేద అనే తేడా లేకుండా ఫిత్రా చెల్లించాలి. స్థితిమంతులు తాము సంపాదించిన దానిలో తోచినంత పేదవారికి దానం చేయడం వలన అల్లా ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఆ కుటుంబం ఉంటుందని నమ్మకం. ఈద్గాకి వెళ్లేటప్పుడు ఒకదారి తిరిగి వచ్చేటప్పుడు మరోదారిలో రావడాన్ని ఉత్తమంగా భావిస్తారు. నమాజ్ ముగిసిన తరువాత ఇమామ్ ఉపదేశాన్ని ఇస్తారు. దీక్షలో ఆటంకం లేకుండా ముగిస్తే అల్లాకు కృతజ్ఞతలు తెలుపుతూ నమాజ్ చేస్తారు.

మసీదులు ముస్తాబు

ఏలూరు కల్చరల్ : రంజాన్ పండుగకు అన్ని మసీదులు ముస్తాబయ్యాయి. పట్టణాలు, గ్రామాల్లోని మసీదులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లకు ఏర్పాట్లు చేశారు. పండుగ పురస్కరించుకుని బుధవారం ఏలూరు నగరంలోని దుకాణాలు కిటకిటలాడాయి. ముస్లింలు ఎక్కువగా నివసించే అన్ని కాలనీలు పండుగ శోభను సంతరించుకున్నాయి.కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ముస్లింలు ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆ అల్లా దీవెనలు ఎప్పుడూ మీపై ఉండాలని ఆకాంక్షించారు.

రంజాన్ తోఫాను అటకెక్కించారు

వైసీపీ అధికారంలోకి రాగానే సరుకులు నిలిపివేత

పండుగకు దూరమవుతున్న పేద ముస్లింలు



ఏలూరు రూరల్, ఏప్రిల్ 10: రంజాన్ తోఫా..ఈ పేరు వింటే ముస్లింలకు ఎనలేని ఆనందం. పేద ముస్లింలు పండుగకు పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు చంద్రన్న రంజాన్ తోఫాను తీసుకువచ్చారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ముస్లింలకు సుమారు రూ.400 విలువచేసే పండుగ సరుకులను రేషన్ ద్వారా ఉచితంగా అందించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని అటకెక్కించింది సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు కూడా అందించేవారు. వాటికీ మంగళం పాడేశారు.ప్రస్తుతం రంజాన్ పండుగ వస్తోంది. టీడీపీ హయాంలో రంజాన్ తోఫా తీసుకుని పండుగ సంతోషంగా చేసుకునేవారమని ఇప్పుడు ప్రభుత్వం ఏ విధమైన సరుకులు ఇవ్వడం లేదని పలువురు ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ తోఫాతో పాటు క్రిస్మస్, సంక్రాంతి కానుకలు కూడా రద్దు చేయడంతో ఎంతోమంది పండుగలకు దూరమవుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేకపోయినా రంజాన్ తోఫాతో పండుగ చేసుకునేవారమని ముస్లీమ్‌లు పేర్కొంటున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక పథకాలను తీసివేయడంతో పండుగ చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. టీడీపీ హయాంలో పండుగకు సరుకులు ఇచ్చేవారు. కొత్తవస్త్రాలు లేకపోయినా ప్రభుత్వం ఇచ్చే కానుకలతోనే పండుగ చేసుకునే వారమని వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్ళలో ఒక్కసారి కూడా ఏ సాయం లేదని వాపోతున్నారు.

పేద ముస్లింల పొట్టకొట్టారు



వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లీమ్, మైనార్టీలపై అణచివేత దోరణి ప్రదర్శిస్తోంది. వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దుచేసింది. కార్పొరేషన్ ద్వారా అందాల్సిన సబ్సిడీ రుణాలను రద్దుచేసింది. మహిళలకు అందించే ఉచిత కుట్టుమిషన్‌లు తీసివేసింది. ప్రతి పేద, ముస్లీమ్ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని చంద్రబాబు ప్రవేశపెట్టిన రంజాన్ తోఫాను ఈ ప్రభుత్వం దూరం చేసి వారి పొట్టకొట్టింది. ప్రస్తుతం సరుకులు, వస్త్రాల దరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో పండుగ చేసుకోవాలంటే భారంగా మారింది. రంజాన్ తోఫాను కొనసాగించి ఉంటే బాగుండేది.

-ఎండీ ఇక్బాల్, టీడీపీ ముస్లిం నాయకుడు

పంట అమ్మేదెలా ?



వైసీపీ ప్రభుత్వ విధానాలతో రైతుల్లో ఆందోళన

గడిచిన పంటల్లో ధరలో కోత .. సొమ్ము జాప్యం

ఈ ఐదేళ్లలో నానా అవస్థలు

ఈ ఏడాదైనా సజావుగా సాగేనా



భీమవరం రూరల్, ఏప్రిల్ 10 : దాళ్వా పంట పండింది.. పంట కూడా కోసి చేతికి వచ్చింది. అయితే రైతుల్లో ఇప్పుడే భయం మొదలైంది.. ధాన్యం కొనుగోళ్లలో వైసీపీ ప్రభుత్వ విధానాలను తలచుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ఎంత బాగా పండినా ఎన్ని కేజీలు కోత కోస్తారో ? ధాన్యం సొమ్ము ఎప్పుడు ఇస్తారో అనే అనుమానాలు వెంటాడతున్నాయి . టీడీపీ ప్రభుత్వం హాయంలో మంచి ధర వచ్చేది.. సొమ్ము త్వరగా ఇచ్చేవారు. ఈ ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపించింది. సాగు చేయాలంటేనే భయపడే పరిస్థితికి రైతులు వచ్చారు. జిల్లాలో ఈ దాళ్వాలో 2 లక్షల 50 వేల ఎకరాలలో సాగు సాగాల్సి ఉండగా 2 లక్షల 25 వేల ఎకరాలలో మాత్రమే సాగింది.

ఎకరానికి రూ.10 వేలు పైగా నష్టం

గత పంటకాలానికి ధాన్యం అమ్మకంలో ప్రభుత్వం విధివిధానాలతో రైతులు అవస్థలతో పాటు ధరలో నష్టం చవిచూడాల్సి వచ్చింది. ధాన్యం అమ్మకానికి సంచులు గురించి పడిగాపులు పడ్డారు. ధాన్యం అమ్మిన తరువాత నెలలు తరబడి ధాన్యం సొమ్ములు కోసం వేచి చూశారు. గడిచిన దాళ్వా, సార్వా పంటలలో ఎకరానికి రూ.10 వేలు పైనే నష్టం చూడాల్సి వచ్చింది. బస్తాకు 5 కేజీల నుంచి 10 కేజీల వరకు మిల్లర్లు కోత కోశారు ఈ దాళ్వా పంట ఏమవుతుందోననే భయం రైతులను వెంటాడుతోంది. అంతేకాకుండా ధాన్యం సొమ్ము ఆలస్యమైతే రైతులకు పెట్టుబడి సొమ్ముకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ప్రతీ పంటలోను జాప్యం కారణంగా వడ్డీ రూపంలో నష్టం భరిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం..

దాళ్వా పంట ధాన్యం కొనుగోలు మొదలైంది. జిల్లాలో 306 ఆర్బీకేలలో క్లస్టర్ వారీగా 266 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశారు. 11 ఆర్బీకేలలో కొనుగోలు మొదలైంది. గణపవరం, నర్సాపురం, పెనుమంత్ర, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాలలో 1182 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 2 లక్షల 25 ఎకరాలలో దాళ్వా సాగు సాగగా 9 లక్షల 18 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశారు. 7 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని ప్రాథమికంగా అంచనా వేశారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి యువకుడి మృతి

లింగపాలెం, ఏప్రిల్ 10: లింగపాలెం మండలం సుందర్‌రావుపేట గ్రామానికి చెందిన జూట్రు మారేష్ (30) పురుగుమందు తాగి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మారేశ్వరరావు పొలం పనులకు వెళ్ళి అక్కడ పురుగు మందు తాగాడు. పొలం యజమాని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు లింగపాలెంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నారావు తెలిపారు.

హాంకాంగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.6 లక్షలకు టోకరా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 :హాంకాంగ్ దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి మోసగించిన వ్యక్తిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. విశాఖపట్నంలోని గోపాలపట్నం ప్రాంతానికి చెందిన దివ్వెల లక్ష్మణరావు ఏలూరు సమీపంలోని సత్రంపాడు ఎమ్మార్పీ కాలనీకి చెందిన శ్రవణం సునీల్ కుమార్‌కు పరిచయమయ్యాడు హాంకాంగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని లక్ష్మణరావు మాయమాటలు చెప్పి సునీల్ కుమార్ నుంచి దఫదఫాలుగా రూ.6 లక్షలు తీసుకొని మోస గించాడు. బాధితుడు బుధవారం రాత్రి ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 : అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న ఒక వ్యక్తిపై జిల్లా ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కేసు నమోదు చేశారు. కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్నారు. తనిఖీలు చేసి అతనిపై కేసు నమోదు చేశారు. 56,396 రూపాయలు అపరాధ రుసుం విధించారు. నాలుగు వేల రూపాయలు జరిమానా వేశారు.

వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీ

ముసునూరు, ఏప్రిల్ 10: ముసునూరు మండలం గోపవరం శివారు పెద్దపాటివారిగూడెంలో మంగళవారం రాత్రి వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు, స్టార్టర్లు, ఫ్యూజులకు ఉన్న రాగి వైర్లు చోరీకి గురయ్యాయి. సుమారు 36 మంది రైతులకు చెంది 40 వ్యవసాయ బోర్ల సామాగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. వీటి విలువ రూ.208 లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.


కరుగోరుమిల్లిలోని ఇసుక ర్యాంపులో నిలిచి ఉన్న ట్రాక్టర్లు

కేసూ లేదు.. ట్రాక్టర్ల జాడ లేదు

పోలీసులకు అప్పగించామంటున్న రెవెన్యూ అధికారులు

ఖాళీ ట్రాక్టర్లపై కేసెలా పెడతామన్న పోలీసులు

మందుగుండు సామాగ్రి కాల్చిన అక్రమ రవాణాదారులు

పాలకొల్లు, ఏప్రిల్ 10: ఆచంట మండలం కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్‌లో మంగళవారం ఇసుక అక్రమ రవాణాను స్థానికులు నిలుపుదల చేశారు. ఒక ఎక్స్‌కవేటర్, సుమారు 10 ట్రాక్టర్లను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ర్యాంప్ వద్దకు వెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే మంగళవారం రాత్రికి ర్యాంపు నుంచి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు మాయం అయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సంఘటన జరగ్గా రాత్రి 10 గంటల సమయానికి ఇసుక అక్రమ రవాణాదారులు అక్కడ నుంచి దుకాణం సర్దేశారు. ట్రాక్టర్లను ఏం చేశారని ఆచంట తహసీల్దార్‌ను వివరణ కోరగా వాటిని ఆచంట పోలీసులకు అప్పగించామని తెలిపారు. మైనింగ్ అధికా రులకు సమాచారం ఇచ్చినట్టు చెబుతున్నారు. అయితే పోలీసులు దీనిపై కేసు నమోదు చేయలేదు. ఖాళీ ట్రాక్టర్లపై కేసు నమోదు చేయడం సాధ్యం కాదని, ఇసుక ఉంటేనే కేసు పెట్టే వీలు ఉందని ఆచంట పోలీసులు వింత వాదనలు వినిపించడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆధారాలతో పట్టి ఇచ్చిన ట్రాక్టర్లను వదిలి వేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ అధికారులను వివరణ తీసుకోవడానికి ప్రయత్నించగా సంబధిత అధికారులు స్పందించడం లేదు. ఇదిలా ఉంటే అధికార పార్టీ నాయకుల అండదండలతో కేసులు లేకుండా బైటకు వచ్చేసిన పలువురు ట్రాక్టరు యజమానులు మంగళవారం రాత్రి కరుగోరుమిల్లి శివాలయం ప్రాంతంలో పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి కాల్చి పండుగ చేసుకున్నారు. తమను ఎవరూ ఏమీ పీకేది లేదని బాహాటంగా చెప్పడం గమనార్హం. ట్రాక్టర్లను సీజ్ చేసి అక్రమ ఇసుక రవాణాదారులపై కేసు నమోదు చేయకుంటే ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని కరుగోరుమిల్లి గ్రామస్థులు చెబుతున్నారు.


రాజీనామా పత్రాలు చూపుతున్న పి.కన్నాపురం వలంటీర్లు

108 మంది వలంటీర్లు రాజీనామా

భీమడోలు ఏప్రిల్ 10: వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు రాజీనామాలు చేశారు. భీమడోలు మండలం పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 23 మంది గ్రామ వలం టీర్లు బుధవారం తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు. భీమడోలు, ఆగడాలలంక, పోలసానపల్లి తదితర గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు ఆయా గ్రామ పంచాయతీలు, సచి వాలయ అధికారులకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో ఎనిమిది మంది, బొమ్మిడిలో ఒకరు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో శర్మ తెలిపారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలో బుధవారం 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి అందించారు.

ఆకివీడు :ఆకివీడు సచివాలయం-2కు చెందిన తొమ్మిది మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు.

ఆచంట : పెనుమంచిలిలో మరో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ తెలిపారు.మండలంలో 290 మంది వలంటీర్లకు ఇప్పటి వరకు 234 మంది రాజీనామా చేశారు.

ముసునూరు : ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన 29 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో పద్మావతి దేవికి అందజేశారు. మొత్తం 35 మంది వలంటీర్లకు ఉండగా సచివాలయం-1 పరిధిలో 18 మందికి 17 మంది, సచివాలయం-2 పరిధిలో 17 మందికి 12 మంది రాజీనామాలు చేశారు.

నూజివీడు టౌన్ :నూజివీడు పట్టణం 1వ వార్డుకు చెందిన 14 మంది వలంటీర్లు తమ రాజీనామాలను నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డికి అందించారు.

ఆగిరిపల్లి :ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో బుధవారం 8 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వీరితో ఇప్పటికి మండల వ్యాప్తంగా 13 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు.


పోలసానపల్లిలో సచివాలయ అధికారులకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు


గణపవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్‌టీ బృందం

ఎన్నికల తనిఖీలు.. రూ 4.11 లక్షలు సీజ్

చింతలపూడి/గణపవరం ఏప్రిల్ 10: చింతలపూడి మండలం రాష్ట్ర సరిహద్దు అల్లిపెల్లి చెక్‌పోస్ట్ వద్ద పత్రాలు చూపని లక్షా 30 వేల నగదును ఎస్ఎస్ టీమ్ పట్టుకున్నట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. మోటారువాహనంపై వెళుతున్న వ్యక్తిని తనిఖీ చేయగా, ఎటువంటి పత్రాలు, అనుమతులు చూపకపోవడంతో ఈ నగదును స్వాధీనం చేసుకుని జిల్లా ట్రెజరీకి జమ చేసినట్లు తెలిపారు. గణపవరంలో బుధవారం ఎఫ్ఎస్‌టీ బృందం వాహనాలు తనిఖీ చేయగా అనుమతిలేని నగదు 2.81 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

మావుళ్లమ్మకు బంగారం, నగదు అందజేత


బంగారాన్ని అందిస్తున్న తణుకు దాతలు

భీమవరంటౌన్, ఏప్రిల్ 10 : మావుళ్ళమ్మకు తణుకు పట్టణానికి చెందిన పెను గొండ మౌర్య సాయిశృతి దంపతుల పేరు మీద పది గ్రాముల బంగారం విరాళంగా అందించారు. భీమవరం పట్టణానికి చెందిన గుండాసి మణికంఠ, లక్ష్మి దంపతులు నాలుగు గ్రాముల బంగారాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించారు. మావుళ్ళమ్మ నిత్యాన్నదానానికి భీమవరానికి చెందిన బొల్లింపల్లి వెంకటరావు శ్రీలక్ష్మి దంపతులు రూ.50 వేలు విరాళం అందించారు. ఆలయానికి వచ్చిన దాతలు తొలుత అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ఉపప్రధాన అర్చకులు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ప్రసాదాన్ని, అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని అందించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఉన్నారు.

నూకాలమ్మకు 300 గ్రాముల వెండి అందజేత

భీమవరం టౌన్, ఏప్రిల్ 10 : పట్టణంలోని 33వ వార్డు సిరియాల వారి వీధిలో వున్న నూకాలమ్మ అమ్మవారికి వెండి చీర తయారు చేయించుటకు దాత 300 గ్రాముల వెండిని బహూకరించారు. పట్టణానికి చెందిన మంతెన లక్ష్మి బంగార్రాజు, పద్మావతి దంపతులు వెండిని ఆలయ కమిటీ వారికి విరాళంగా అందించినారు. గౌరవ సలహాసభ్యులు మెట్టా మురళీకృష్ణ, అధ్యక్షుడు సిరియాల నాగేశ్వరరావు, కార్యదర్శి రౌతు హరిబాబు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో ఇన్‌ఫినిటో ఫస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగం సాధించడం సులభతరం అవుతుందని డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు అన్నారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో బేసిక్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఇయర్ బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇన్‌ఫినిటో అనే సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమం ఫస్ట్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 16న జరగబోయే ఈవెంట్లో మా విద్యార్థులతో పాటు పలు కళాశాలల విద్యార్థులను ఆహ్వానిస్తామన్నారు. అనంతరం బేసిక్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ జి.రత్నం మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీఎస్ వర్మ, ఏవో ఫణికుమార్, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు. కో-ఆర్డినేటర్స్ వి.ప్రవీణ్, బి.మేషక్‌రాజు, మేసేజ్ వ్యవహరిస్తారు.

బీసీవైపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెంకటస్వామి

నరసాపురం టౌన్, ఏప్రిల్ 10: భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకుల వెంకటస్వామిని ప్రకటిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ జాబితాను విడుదల చేశారు. న్యాయవాదిగా ఉన్న గతంలో వెంకటస్వామి టీడీపీ, జనసేన పార్టీల్లో పని చేశారు. బుధవారం వెంకటస్వామి తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ గురువారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చూడుతున్నట్టు తెలిపారు. బీసీవైపీ పిఠాపురం ఇన్‌చార్జి కళ్యాణి, శివకృష్ణ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో పితామహుడు హానిమన్ జయంతి

నరసాపురం టౌన్, ఏప్రిల్ 10:హోమియోపతి పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి వేడుకను పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా హోమియోపతి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం హనీమన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ రమేష్, డాక్టర్ రాజ్యలక్ష్మి, పావని, స్వామి, సందీప్, వెంకట్రావు, కిరణ్, హెన్రీ, శ్రీరామచంద్రమూర్తి, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలను కలసిన కాంగ్రెస్ అభ్యర్థి బుజ్జి

నరసాపురం టౌన్; ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కానూరి బుజ్జి బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పాతబజార్, పంజా సెంటర్‌లోని ముస్లిం సోదరుల్ని కలసి ఓట్లను అభ్యర్థించారు. ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మల్లిపూడి శ్రీనివాస్, కృపారావు, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మవద్దు

పెంటపాడు, ఏప్రిల్ 10: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఆయన ఆకుతీగపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఏవో పార్థసారధి మాట్లాడుతూ మండలంలో మొత్తం 17 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీముఖదారమ్మకు తనికెళ్ల భరణి పూజలు


దర్శించుకుంటున్న రచయిత భరణి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 10 : స్థానిక అచ్చుగట్లపాలెంలో వున్న శ్రీముఖదారమ్మ అమ్మవారి జాతర సందర్భంగా రెండో రోజు బుధవారం ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ళ భరణి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి యినుకొండ మార్తాండ సుబ్రహ్మణం కుటుంబ సభ్యులు అమ్మవారికి కుంభం పోశారు. అర్ధరాత్రి పెద్దఎత్తున బాణసంచా కాల్పులు నిర్వహించారు. అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, వలంటీర్లు భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న ఉగాది కవి సమ్మేళనం

భీమవరంటౌన్, ఏప్రిల్ 10:శ్రీరామరాజ భూషణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ మహిషాసుర మర్థిని భీమేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి ఉగాది కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. కవి కువలయాలు కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, కడిమళ్ళ వరప్రసాద్ గురుసహస్రావధారి, ఇందుకూరి వెంకట లక్ష్మీపతిరాజు, సరికొండ నరసింహరాజు, రసరాజు, కోట లక్ష్మి నరసింహ సహస్రావధాని, చిలకమర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి, రామకృష్ణంరాజు, జ్యోతిరాజ్ భిశెట్టిలు వారి కవిత్రియాలను వినిపించారు. తొలుత యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ డి.నిర్మలాజ్యోతి, ప్రమీల విజయబాబు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి వెంకట్రామరాజు, రాయప్రోలు భగవాన్, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

సెయింట్ మేరీస్‌లో 'వృద్ధులకు ఉపశమన కేంద్రం'

భీమవరం క్రైం, ఏప్రిల్ 10 : జీవిత చరమాంకంలో వృద్ధులు మనశ్శాంతిని పొందడానికి ఈ ఉపశమన కేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయని విజయవాడ సెయింట్ మేరీస్ ఆసుపత్రి ప్రొవెన్స్ లీడర్ ఆఫ్ నిర్మల సిస్టర్స్ సిస్టర్ బ్లాంచ్ డిమెల్లా అన్నారు. భీమవరం సెయింట్ మేరీస్ ఆసుపత్రిలో వృద్ధులకు ఉపశమన కేంద్రంను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కేర్ సెంటర్‌లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు సంపూర్ణ వైద్యసేవలు అందిస్తామని, రోగులకు కౌన్సెలింగ్ అందిస్తారని, ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు, ఒక సోషల్‌వర్కర్స్ ఉంటారని 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ఆసుపత్రి వైద్యులు సిస్టర్ మేరీ, అనిట్, డాక్టర్ సిస్టర్ సిమిలి, సిస్టర్ రెజ్జీ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పితాని తనయుడు వెంకట్

పెనుమంట్ర, ఏప్రిల్ 10:రంజాన్ నెల రోజులు ముస్లిం సోదరులు నిర్వహించిన ఉపవాస దీక్షలు విరమించారు. ఆకాశంలో నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ నిర్వహించుకుంటారు. ఈ సందర్భంగా మార్టేరులోని జమ్మి మసీద్‌లోని ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లింల ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. ముస్లిం పెద్దలతో పాటు టీడీపీ నాయకులు కర్రి అచ్యుత రామిరెడ్డి, తేతలి రాజారెడ్డి, మల్లిడి మీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కారేపల్లి భాస్కరరావు, మజ్జి అచ్యుతరావు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణ -ప్రజల బాధ్యత' పై సమావేశం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 10: 'రాజ్యాంగ పరిరక్షణ-ప్రజల బాధ్యత' అనే అంశంపై భీమవరం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఎందరో త్యాగమూర్తులు ప్రాణాలర్పించి దేశానికి తీసుకొచ్చిన స్వాతంత్ర్యాన్ని మనం సమకూర్చుకున్న రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్, జనసంఘీయులు ఒప్పుకోవడం లేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జేఎన్‌వీ గోపాలన్, పార్వర్డ్‌బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు.

ప్రజాగళం.. జనసంద్రం

చంద్రబాబు, పవన్‌లకు జననీరాజనం

తణుకు/ఇరగవరం/తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 10 : టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తణుకు పట్టణంలో చేపట్టిన రోడ్ షో, ప్రజాగళం సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఎండను సైతం లెక్కచేయకుండా మధ్యాహ్నం నుంచే తమ అభిమాన నాయకుల కోసం ఎదురు చూశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సభకు తరలి రావడంతో పట్టణమంతా సందడి వాతావరణం నెలకొంది. సభలో పాల్గొనేందుకు హెలీకాప్టర్‌లో తణుకు చేరుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో ల్యాండ్ అయ్యారు. అప్పటికే చేరుకున్న నాయకులు ఇరువురికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ జనసందోహం నడుమ సభా వేదిక వద్దకు ర్యాలీగా బయలుదేరారు. వెంకటేశ్వర కూడలి, టౌన్‌హాల్ సెంటర్ల వద్ద ఇరువురికి క్రేన్ల సహాయంతో భారీ గజమాలలతో నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అరగంట సేపు సాగిన ర్యాలీలో దారిపొడవునా పువ్వులు జల్లుతూ కార్యకర్తలు అభివాదం చాటుకున్నారు. యువత పెద్ద సంఖ్యలో రహదారికి ఇరువైపులా చేరుకుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ విజయకేతనం చూపించారు. ఇరువురు నాయకులు ప్రజలకు అభివాదం చేసుకుంటూ సభావేదిక వద్దకు చేరుకున్నారు. సభ అనంతరం ప్రధాన రహదారి వెంబడి పాలంగి మీదుగా తూర్పుగోదావరి జిల్లా వైపుకు సాగారు. ఈ సభకు భారీ ఎత్తున అభిమానులు తరలిరావడంతో వారిని నిలువరించడం పోలీసులు కాస్త కష్టతరమైంది.


తణుకు ప్రజాగళంలో అశేషజనం
పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు
చిన్నారుల ఉత్సాహం
కూటమి జెండాల రెపరెపలు
జనసేన శ్రేణుల బైక్ ర్యాలీ
మోదీ మాస్క్‌తో..
కళాకారుల స్వాగతం


నరసాపురం ప్రచారంలో నాయకర్, పొత్తూరి.. వల్లూరు సర్పంచ్ వేణును పార్టీలోకి ఆహ్వానిస్తున్న గన్ని.. గణపవరంలో పత్సమట్ల ధర్మరాజు ప్రచారం

ఓటుతో వైసీపీని తరిమికొడదాం

» నరసాపురం కూటమి అభ్యర్థి బొమ్మిడి నాయకర్

నరసాపురం రూరల్, ఏప్రిల్10:రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓటుతో తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం కొప్పర్రులో కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం నాయకర్ మాట్లాడుతూ తీర ప్రాంతాన్ని అన్ని విధాలుగా వైసీపీ నాశనం చేసిందన్నారు. శిలాఫలకాలు, హామీలే తప్ప అభివృద్ధి ఏమి లేదన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమన్నారు. జనసేన నాయకులు చాగంటి చిన్న మాట్లాడుతూ కూటమికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వీవీఆర్, చినమిల్లి సత్యనారాయణ, వలవల నాని, వర్ధనపు ప్రసాద్, ఆకన చంద్రశేఖర్, ముక్కు బాబూరావు, వాతాడి ఉమా, నళిని, రావూరి సురేష్, ఆందే అమర్, బుల్లి సత్యం, చింతపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గన్ని సమక్షంలో టీడీపీలో చేరికలు

గణపవరం, ఏప్రిల్ 10: గణపవరం మండలం వల్లూరు గ్రామ సర్పంచ్ ముచ్చర్ల వేణుగోపాల మురళీకృష్ణ, ఉపసర్పంచ్ పెద్దింటి శివరామకృష్ణ, కొండవీటి రమేష్ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కండువాలు కప్పి బుధవారం పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయానికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, మాజీ ఎంపీటీసీ దాయిని వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వ స్థాపనకు సహకరించాలి : పత్సమట్ల

గణపవరం, ఏప్రిల్ 10: గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేసి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించేందుకు సహకరించాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం గణపవరంలోని ఇందిరమ్మ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారని రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించి కూటమిని బలపరచాలని కోరారు. బీజేపీ ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ చరణాల మాలతీరాణి, టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు,గణపవరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, జిల్లా టీడీపీ కార్యదర్శి సుబ్బారావు, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల కోసమే కూటమి : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 10: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకే మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజల ముందుకు వస్తున్నామని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పడాలలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అరాచక పాలనతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారని వారి బాధలను తీర్చేందుకే తాము ఉన్నామన్నారు. స్థానిక మంత్రి పని చేయాలంటే లంచం అడుగుతూ రౌడీ రాజ్యంగా మార్చారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పితాని సమక్షంలో టీడీపీలో చేరిన యువత

ఆచంట : కొడమంచిలి చినపేటకు చెందిన సుమారు పది మంది యువకులు టీడీపీలో చేరారు. ఇటీవల కొడమంచిలిలో జరిగిన మాజీ మంత్రి, పితాని ఎన్నికల ప్రచారంలో యువకులు టీడీపీలో చేరగా వీరికి పితా ని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రా పాక నాగేశ్వరరావు, చిన్నం హేమంత్, చల్లబత్తుల దుర్గా ప్రసాద్, కుసుమే కృపానిధి, నేలపూడి సిద్దు, చంటి రాజు, కప్పల శ్యామ్‌సన్, నేలపాటి నరేష్ ఉన్నారు.

● పెనుమంట్ర, ఏప్రిల్ 10 :వైసీపీ నుంచి పదకొండు మంది వెలగలేరుకు చెందిన నాయకులు టీడీపీలో చేరారు. బుధవారం మాజీ మంత్రి, ఆచంట కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ సమక్షంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ లో వెలగలేరు చెందిన సత్తి సత్యనారాయణరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, సర్వసుద్ది షణ్ముఖయాదవ్, పడాల ఆదినారాయణ రెడ్డి, దిండి అరవింద్ యాదవ్, సత్తి బుల్లిరెడ్డి, పడాల బుల్లిరెడ్డి, డి.పూడియామకృష్ణ, కొవ్వూరి అయ్యప్పరెడ్డి, బోడపాటి దుర్గారావు, బిరుదుకోట రాజు ఉన్నారు.


పడాలలో మాట్లాడుతున్న బొలిశెట్టి శ్రీనివాస్


పితాని సమక్షంలో టీడీపీలో చేరిన కొడమంచిలి చినపేట యువకులు

చంద్రబాబుకు బాబ్జి ఘన స్వాగతం


చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వలవల బాబ్జి, చిత్రంలో తణుకు అభ్యర్థి ఆరిమిల్లి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 10: తణుకు ప్రజాగళం సభకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కూటమి విజయం కోసం పక్కా ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్ళాలని చంద్రబాబునాయుడు సూచించినట్లు బాబ్జి తెలిపారు.

చంద్రబాబు సమక్షంలో భారీగా చేరికలు

తణుకు, ఏప్రిల్ 10: తణుకు నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. తణుకు సభకు విచ్చేసిన చంద్రబాబు సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. చంద్రబాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తణుకు ఏఎంసీ మాజీ చైర్మన్ ములగాల శ్రీనివాసు, అత్తిలి మండల పరిషత్ అధ్యక్షుడు మట్టా సూర్యారావు, చిటికిన ఏడుకొండలు, యాతం చంద్రశేఖర్, ఇవటూరి గణపతి శర్మ, వావిలాల సరళాదేవి, నీలం హరీష్‌నాయుడు, బొద్దాని అనిల్ కుమార్ టీడీపీలో చేరారు.

కార్యకర్తల బైక్‌ను ఢీకొన్న బస్సు

తణుకు, ఏప్రిల్ 10: ప్రజాగళం సభకు తరలి వస్తున్న కార్యకర్తల మోటారు సైకిల్‌ను తణుకులోని ఒక ప్రైవేటు కాలేజీ బస్సు ఢీకొంది. బుధవారం మధ్యాహ్నం వేల్పూరు రోడ్డులో జరిగిన ఈ ఘటనలో మోటారు సైకిల్ పూర్తిగా ధ్వంసమైంది. వివిధ పార్టీల కార్యకర్తలు బస్సు డ్రైవరుతో వాదనకు దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలుపునకు దోహదం


కోలనపల్లిలో శివరామరాజుకు సత్కారం

కాళ్ళ, ఏప్రిల్ 10 : నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఈ ఎన్నికల్లో గెలుపొందడానికి దోహదపడతాయని ఉండి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. బుధవారం మండలంలోని కోమటిగుంట, కోలనపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు, రైతులు అపూర్వ స్వాగతం పలికారు. కోలనపల్లిలో శివరామరాజుకు గజమాలతో సత్కరించారు. ప్రచారంలో కలవపూడి సర్పంచ్ గేదల జాన్, కాళ్ళ సర్పంచ్ బందా విజయ, వేగేశ్న బాలగణపతివర్మ, అల్లూరి అచ్యుతరామరాజు, మంతెన శ్రీరామరాజు, కొప్పినీడి గణపతి, వేగేశ్న కాశీరాజు, కడలి దుర్గాప్రదీప్, గులిపల్లి జోగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలవపూడి పల్లిపాలెంలో అమ్మవార్ల జాతర ప్రారంభం

కలవపూడి పల్లిపాలెంలో గ్రామ దేవతలైన మారెమ్మ మహాలక్ష్మమ్మ జాతర బుధవారం ప్రారంభమయ్యాయి. ఉండి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి కలవపూడి శివరామరాజు ప్రత్యేక పూజలు చేసి గరగలను ఎత్తుకుని జాతర ప్రారంభించారు. జాతరలో మాజీ సర్పంచ్ తిరుమాని మార్రాజు, మాజీ ఎంపీటీసీ బస్వాని వడ్డీకాసులు, బర్రె కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో రైల్వే వారోత్సవాలు ప్రారంభం

భీమవరం క్రైం, ఏప్రిల్ 10 : భారత రైల్వే వ్యవస్థ చాలా గొప్పదని టౌన్ రైల్వే స్టేషన్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, టౌన్, జంక్షన్ రైల్వేస్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం భారత రైల్వే వారోత్సవాలు ప్రారంభించారు. రైల్వే పార్శిల్ ఆఫీసర్ ఉదయని, టికెట్ కార్యాలయ సూపర్‌వైజర్ సత్యశ్రీ రైల్వే వ్యవస్థ నాటి నుంచి నేటి వరకు జరుగుతున్న విధివిధానాలను వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 16వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఆధ్యాత్మికం

సోమేశ్వరస్వామికి రూ.2.47 లక్షలు అందజేత


చెక్కు అందిస్తున్న కార్తీక అన్నసమారాధన కమిటీ సభ్యులు

భీమవరంటౌన్, ఏప్రిల్ 10 : గునుపూడి సోమేశ్వరస్వామి దేవస్థానంకు కార్తీక అన్నసమారాధన కమిటీ సభ్యులు బుధవారం 2 లక్షల 47 రూపాయల చెక్కును దేవస్థానం ఈవో కృష్ణంరాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● మొగల్తూరు, ఏప్రిల్ 10: ఉగాది పండుగ పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లోని అమ్మవార్ల జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారితోటలోని చెట్టుకింద ముత్యాలమ్మ, రామన్నపాలెం పంచాయతీ పీపీతోటలో వున్న ముత్యాలమ్మ, కేపీపాలెం నార్త్‌లోని దుర్గమ్మ అమ్మవారి జాతర బుధవారం రాత్రి నిర్వహించారు.

● పాలకోడేరు : పాలకోడేరు గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం మేళతాళాలు గరగనృత్యాలు, ఆసాదుల విన్యాసాలు మంగళవాయిద్యాలు నడుమ ఘనంగా జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. పాలకోడేరు గరువు శ్రీమారెమ్మ అమ్మవారి జాతర బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

● పెంటపాడు : రావిపాడులోని ధనలక్ష్మి అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్స వాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అమ్మవారికి పూజల అనంతరం ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

● పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 10 : స్థానిక వీహెచ్‌పీ ఆధ్వర్యంలో చైత్రశుద్ధ విదియ బుధవారం స్థానిక సలాదివారితోటలో 24 మంది మహిళలు అరుంధతిదేవి పూజలు, వ్రతాలు భక్తిశ్రద్ధలతో చేశారు.

● ఉండి, ఏప్రిల్ 10 : వెలివర్రు వీరపేరంటాలమ్మ ఆలయంలో భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.● భీమవరంటౌన్ : వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మెంటే వారి తోటలోని బాలాత్రిపురసుందరీ అమ్మవారికి ప్రత్యేక దీపాలంకరణ చేశారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా రామరాజునే కొనసాగించాలి

» టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను ఆధ్వర్యంలో ఆమరణ దీక్ష


రామరాజుకు మద్దతుగా ఆమరణ దీక్షకు కూర్చున్న టీడీపీ నాయకులు

ఉండి, ఏప్రిల్ 10: వచ్చే ఎన్నికలలో ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంతెన రామరాజునే కొనసాగించాలని తెలుగు తమ్ముళ్లు ప్లకార్డులు పట్టుకుని పలువురు ఆమరణదీక్షకు పూనుకున్నారు. బుధవారం ఉండి టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీను, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు చెన్నంశెట్టి హరినాయుడు, నరసాపురం పార్లమెంటు తెలుగుయువత కార్యవర్గ సభ్యుడు కాలా గణేష్ ఆమరణదీక్షలో కూర్చున్నారు. వారికి పలువురు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఉండి, కాళ్ల మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, గుండాబత్తుల నాగేశ్వరరావు, కిన్నెర వెంకన్న, పేరిచర్ల బాలరాజు, యశోధ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సిబ్బంది పనిచేయాలి : ఆర్డీవో

నరసాపురం, ఏప్రిల్ 10: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది పని చేయాలని ఆర్డీవో అంబరీష్ ఆదేశించారు. బుధవారం వైఎన్ కళాశాలలో పీవోలు, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణ, విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఒక రోజు ముందుగా సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాలన్నారు. విధిగా పోలింగ్ కేంద్రంలోనే బస చేయాలన్నారు. పార్టీలు పంపే ఆహారాన్ని తీసుకోరాదన్నారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్‌ను ప్రారంభించాలన్నారు. ఎక్కడైన సమస్యలు వస్తే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. కమిషనర్ వెంకటేశ్వరావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంఈవో పుష్పరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

● ఆచంట, ఏప్రిల్ 10 : ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. స్థానిక ఎంవీవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు ఎన్నికల నియమావళిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో 232 మంది పీవో, ఏపీవోలతో పాటు తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

'గత ఎన్నికల కంటే ఉత్తమ ప్రదర్శన కనబరుస్తాం'

భీమవరం అర్బన్, ఏప్రిల్ 10: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ గత ఎన్నికల కంటే ఉత్తమ ప్రదర్శన కనబరుస్తామని ఏఐసీసీ ఎన్నికల అబ్జర్వర్ మనోజ్ చౌహాన్ అన్నారు. భీమవరం కాంగ్రెసు పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి అంకెం సీతారామ్ అధ్యక్షతన కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని అభ్యర్థులను ప్రకటించారు. భీమవరం అంకెం సీతారాం, తణుకు కడలి రామారావు, నర్సాపురం కానూరు బుజ్జి, పాలకొల్లు కొలుకులూరి అర్జున్‌రావు, తాడేపల్లిగూడెం మార్నీడి బాబ్జి, ఉండి వేగేశ్న వెంకట్ గోపాలకృష్ణలను అభ్యర్థులుగా ప్రకటించామన్నారు. పార్టీ నాయకులు సుంకర పద్మశ్రీ, జంపన సుబ్రహ్మణ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఏఈఆర్వో తనిఖీ

ఆకివీడు, ఏప్రిల్ 10:మద్యం దుకాణాలో అక్రమ మద్యం కనబడితే చర్యలు తప్పవని ఏఈఆర్వో కె.రాధాకృష్ణ హెచ్చరించారు. మంగళవారం రాత్రి స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఏడు మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. తనిఖీల సమయంలో దుకాణాల్లో అక్రమ మద్యం ఉన్నా, ఓ వ్యక్తికి మూడు బాటిల్స్ కన్నా ఎక్కువగా అమ్మకాలు జరిపినట్టు తెలిసినా ఎక్సైజ్ చట్ట ప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు ప్రచారం

ఆకివీడు, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గోపాలకృష్ణంరాజు బుధవారం స్థానిక రోజువారీ సంత ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపడితేనే పూర్వ వైభవం వస్తుందన్నారు. పార్టీ నేతలు ఉన్నారు.